ప్రజాశక్తి





నిరసన తెలుపుతున్న గిరిజనులు

గ్రామంలోనే రేషన్ ఇవ్వాలని నిరసన

వేపాడ : గ్రామంలోనే రేషన్ ఇవ్వాలని కోరుతూ మండలంలోని దుంగాడ గిరిజనులు గురువారం నిరసన చేపట్టారు. ఆరు కిలోమీటర్ల దూరంలోని డిపోకు వెళ్లి రేషన్ తీసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామంలోనే సరుకులు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొప్పల అప్పారావు పాల్గొన్నారు.

నేటి నుంచి డిఎస్‌సి పరీక్షలు

- 583 పోస్టులు.. 36,495 దరఖాస్తులు
- పకడ్బందీగా ఏర్పాట్లు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు



సబ్జెక్టుల వారీ వచ్చిన దరఖాస్తులు

ఎస్‌జిటి	7171
ఎస్‌ఎ తెలుగు	987
ఎస్‌ఎ లెక్కలు	1643
ఎస్‌ఎ పిఎస్	2783
ఎస్‌ఎ బయోలజీ	1826
ఎస్‌ఎ సోషల్	2821
పిఇటి	1414
పీడీ	1541
ఇంగ్లీష్	2464
పీజీటీ	11,773

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 6నుంచి ప్రారంభమయ్యే మెగా డిఎస్‌సి నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి ఈనెల 30వరకు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో పరీక్ష జరగనుంది. జిల్లాలో 583 ఉపాధ్యాయ పోస్టులకు సుమారు 36,495 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఒకే పరీక్ష రాసే వారు 18,002 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసారు. సీతం కాలేజీలోని ఐయాన్ ఐయాన్ డిజిటల్‌సెంటర్, లెండి ఇంజినీరింగ్, ఎంవిజిఆర్ ఇంజనీరింగ్, అవంతి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు. ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9.30 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు రెండు పూటలా పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరుకావాలని, హాల్ టిక్కెట్‌తోపాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని ఇప్పటికే అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాలవద్ద పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక ఛీఫ్ సూపరింటెండెంట్, సిటింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసారు. అన్ని పరీక్షా పరీక్షా కేంద్రాలవద్ద వైద్య శిబిరాలు, తాగునీరు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు.

తప్పులు సరిదిద్దుకొనే అవకాశం ఉంది

డిఎస్‌సి హాల్‌టిక్కెట్‌లో ఏమైనా తప్పులు నమోదై ఉంటే సరిదిద్దుకొనే అవకాశం ఉందని, వాటికోసం అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం స్పష్టం చేసింది. ఏదైతే తప్పు నమోదయ్యిందో, దానికి సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికేట్‌ను చూపించి, ధ్రువీకరించిన దాని జెరాక్స్ కాపీని అందజేసి, పరీక్షా కేంద్రంవద్దే సరిచేసుకూనే అవకాశం కల్పించారు. తప్పులు సరిచేయించుకొనేవారు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.

అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం



ఉపాధ్యాయ నియామక డిఎస్‌సి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షలు ప్రశాంతంగా రాసుకునే విధంగా అభ్యర్థులకు సౌకర్యాలు కల్పించాం. గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ సదుపాయం, తాగునీరు, విద్యుత్ సరఫరా కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం.

- డిఇఒ మాణిక్యం నాయుడు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- ఏకో టూరిజం పార్కులుగా నగర వనాల అభివృద్ధి : ఎమ్మెల్యే లోకం నాగమాధవి
- కొండవెలగాడ నగర వనంలో మొక్కలు నాటిన కలెక్టర్, ఎమ్మెల్యే



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎమ్మెల్యే నాగ మాధవి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పర్యావరణాన్ని పరిరక్షణపైనే మన ఆరోగ్యం ఆధారపడి వుంటుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై కూడా శ్రద్ధ చూపాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నెల్లిమర్ల రూరల్ మండల పరిధిలోని వెలగాడలో వున్న నగరవనంలో గురువారం కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌తో కలసి నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లిమర్లలోని రెండు నగర వనాల అభివృద్ధి కోసం ఉప ముఖ్యమంత్రి నిధులు కేటాయించారని ఒక్కొక్కటి రూ.1.25 కోట్లు వెచ్చించి ఎకో టూరిజం పార్కులుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. స్వయంపోషక మొక్కలనే నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే అటవీశాఖ అధికారులకు సూచించారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ వన మహోత్సవం ద్వారా ఈ ఏడాది జిల్లాలో నాలుగు లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని, ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నేటి నుంచి ప్రారంభిస్తున్నామని చెప్పారు. పర్యావరణాన్ని సంరక్షిస్తే అది మనల్ని కాపాడుతుందన్నారు. ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సవరమ్మ, డిఎంహెచ్‌ఒ జీవనరాణి, ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్, హౌసింగ్ పీడీ మురళి, తహశీల్దార్, ఎంపిడిఒ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే నాగమాధవి తదితరులు నగరవనంలో మొక్కలు నాటారు.

పర్యావరణాన్ని కాపాడండి : జిల్లా జడ్జి

విజయనగరం లీగల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ప్లాస్టిక్ తో ముప్పు అనే నినాదంతో ప్రజలకు విస్తత అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.బబిత తెలిపారు. జిల్లా న్యాయస్థానాల సముదాయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి బబిత మాట్లాడుతూ పజలందరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. 70 మైక్రాన్ల కన్నా ఎక్కువ ప్రణామాలు కూడిన ప్లాస్టిక్ బ్యాగులు వాడితే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, అందువల్ల ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయం గా స్టీలు గ్లాసులు, స్టీలు బాటిల్స్,కాటన్ బ్యాగులు ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో నాల్గవ అదనపు జిల్లా జడ్జి బి అప్పలస్వామి, ఐదో అదనపు జిల్లా జడ్జి ఎన్ పద్మావతి, సీనియర్ సివిల్ జడ్జి బిహెచ్ వి.లక్ష్మి కుమారి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి ఎ.కష్ణ ప్రసాద్, మొబైల్ కోర్టు జడ్జి బుజ్జి , బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కె రవి బాబు, నాయమూర్తులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మిక చట్టాల్లో మార్పులకు వ్యతిరేకంగా

సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తూ టిడిపి కూటమి ప్రభుత్వ కేబినెట్ చేసిన నిర్ణయాలను తక్షణమే నిలిపివేయాలని సిఐటియు ఆధ్వర్యాన గురువారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, కార్యదర్శి ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అడుగుజాడల్లో చంద్రబాబు కూటమి ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. బ్రిటిష్ కాలంలోనే కార్మిక వర్గం పోరాడి 8 గంటల పని దినాన్ని సాధించుకుందని, దాన్ని 10 నుంచి 12 గంటలకు పెంచడం ద్వారా కార్మికుల శ్రమను మరింత దోపిడీ చేసుకునేందుకు అవకాశం కల్పించడమేనని చెప్పారు. మహిళ సాధికారత అంటూ గొప్పగా చెప్పి, రాత్రివేళల్లో పనిచేసేందుకు అనుమతించారని, ఇందులో మహిళ భద్రతకు సంబంధించి ఎటువంటి చర్యలూ లేవని తెలిపారు.

మహిళా సాధికారతపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వివిధ ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న మహిళలందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలు చేయొద్దని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు యు.ఎస్ రవికుమార్, బి.రమణ, పాపారావు, రాఘవ, సుధీర్, వాసు, వెంకటేష్, సురేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సిల ఆర్థికాభివృద్ధికి

రూ.340 కోట్లతో ప్రణాళికలు

యువతకు ఉపాధి పథకాలు : రాష్ట్ర మాల సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ విజయకుమార్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్రవంలో ఎస్‌సిల ఆర్థికాభివృద్ధికి రూ340కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్లు రాష్ట్ర మాలల సహకార ఆర్థిక సంస్థ ఛైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ చెప్పారు. ప్రతిఇంట్లో ఒక ఎస్‌సి యువతీ యువకుడిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తగా రూపొందించడమే లక్ష్యంగా ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉపాధి పథకాలను రూపొందించి అందుకు తగ్గట్టు అవసరమైన నైపుణ్యశిక్షణ, వున్న నైపుణ్యాలను మెరుగుపరిచే శిక్షణను ఎస్.సి.యువతకు ఇవ్వనున్నామని తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన గురువారం ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.



మీడియాతో మాట్లాడుతున్న ఛైర్మన్ విజయకుమార్

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా అమలు జరుగుతున్న ఉపాధి కల్పన పథకాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి వాటిని ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా వాటిని రూపకల్పన చేయడమే తన పర్యటన లక్ష్యమని ఈ సందర్భంగా చెప్పారు. సమావేశంలో ఎస్.సి.మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడయ్య, ఎస్.సి.కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఎస్.సి. నాయకుడు ఆదాడ మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం జిల్లాకు వచ్చిన మాల కార్పొరేషన్ ఛైర్మన్ నగరంలో పలు వర్గాలతో భేటీ అయ్యారు. ఎస్.సి.కార్పొరేషన్ కార్యాలయంలో నాక్ పథకం కింద కుట్టుశిక్షణ పొందుతున్న 30 మంది ఎస్.సి.యువతులతో సమావేశమై వారి శిక్షణ గురించి తెలుసుకున్నారు.

కలెక్టర్‌తో భేటీ

మాలల కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయకుమార్ జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను క్యాంపు కార్యాలయంలో కలసి జిల్లాలో ఎస్‌సిలు ప్రత్యేకంగా మాలలకు అమలు జరుగుతున్న పథకాలపై చర్చించారు. సందర్భంగా ఎస్‌సిల ఆర్థికాభివృద్ధికి జిల్లాలో చేపడుతున్న చర్యలను కలెక్టర్ ఆయనకు తెలిపారు. అనంతరం అంబేద్కర్ భవన్‌ను పరిశీలించారు. భవనాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2025 -26 విద్యా సంవత్సరానికి ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతితో పాటు 7, 8,9, ఇంటర్ మొదటి ఏడాదిలో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించేందుకు ఈనెల 5 నుంచి 20 వరకు విద్యాశాఖ అవకాశం కల్పించిందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 10 నుంచి 20వ తేదీలోగా దరఖాస్తు చేయాలన్నారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు పాఠశాల స్థాయిలో 24న నిర్వహిస్తారని, ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈనెల 25న విడుదల చేస్తారని తెలిపారు. 26న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఎటువంటి ఫీజులు చెల్లించనవసరం లేదన్నారు. ఇతర వివరాలకు ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలని తెలిపారు.

వైసిపి హయాంలో అభివృద్ధి వెనక్కి

ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

గత వైసిపి పాలనలో అభివృద్ధిలో రాష్ట్రం వెనక్కి వెళ్లిందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ఐదేళ్ల పాలనలో అన్ని రంగాలు వెనుక బడ్డాయని విమర్శించారు. రోడ్లు పాడైపోయినా బాగు చేసేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు టిడిపి హయాంలో అన్న క్యాంటీన్లు పెడితే వైసిపి హయాంలో మూసివేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిలో హామీలు నెరవేర్చలేదని వెన్నుపోటు నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేసి అభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. పాడైపోయిన రోడ్లు బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామభద్రపురం - పార్వతీపురం రోడ్డులో గొర్లెసీతారాంపురం, పాతబొబ్బిలి వద్ద ఉన్న గోతులను పూడ్చేందుకు నిధులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. పూల్‌బాగ్ రోడ్డును మున్సిపల్ నిధులు, తన సొంత నిధులతో బాగు చేస్తామన్నారు. 30 ఏళ్ల వరకు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రణాళికా బద్ధంగా పనులు చేస్తామన్నారు. ఆకులకట్ట, పినపెంకి, బొబ్బిలి, తెర్లాం రహదారులు పూర్తిగా పాడైపోవడంతో పక్కా ప్రణాళికతో దృఢమైన రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-రాజాం

మండలంలోని పొగిరి సచివాలయం వద్ద ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ గురువారం రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి హయాంలో రైతులను పూర్తిగా సంక్షోభంలోకి నెట్టారని తెలిపారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన ధాన్యం బకాయిలు నేడు కూటమి ప్రభుత్వం తీర్చి, రైతులకు అండగా నిలిచిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందిస్తామని చెప్పారు. అనంతరం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావు నాయుడు, సుమల వెంకట మన్మధరావు, జడ్డు విష్ణు, గురవాన నారాయణ రావు, దుప్పల పూడి శ్రీను, వంగా వెంకటరావు, జగన్ మోహన్, జడ్డు మోహన్, ఎన్.స్వామి నాయుడు, డి.మురళీ, మాడుగుల జయరాం పాల్గొన్నారు.

జాతర్లలో నిఘాకు అత్యాధునిక డ్రోన్

ఎస్‌పి వకుల్ జిందాల్



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో నిర్వహించే సభలు, సమావేశాలు, జాతర్లలో మరింత నిఘాను ఏర్పాటుకు ప్రత్యేకంగా రూపొందించిన టెథర్డ్ డ్రోన్ ను రాష్ట్ర పోలీసుశాఖ జిల్లాకు మంజూరు చేసినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. సాధారణ డ్రోన్స్ కు భిన్నంగా, ప్రత్యేక అవసరాలకు కోసం రూపొందించిన టెథర్డ్ డ్రోన్ పని తీరును పోలీసు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ - ఒక నిర్దిష్ట ప్రదేశాల్లో నిర్వహించే సభలు, సమావేశాలు, జాతర్లలో మరింత నిఘాను ఏర్పాటు చేసేందుకు ఈ డ్రోన్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈడ్రోన్ సుమారు 10గంటలపాటు గాలిలో తేలుతూ ఒక నిర్దిష్ట ప్రదేశంలో జరిగే కార్యకలాపాలపై నిఘాఏర్పాటు చేసే సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఎలక్ట్రిక్ పవర్ లేదా జనరేటరు సహాయంతో ఒక కేబుల్ ఆధారంగా డ్రోన్ పని చేస్తుందన్నారు. ఈ అత్యాధునకి డ్రోన్ సహాయంతో ఒక ప్రాంతంలో నిరంతర నిఘా ఏర్పాటు చేయడానికి, ఒకప్రాంతంలో అకస్మాత్తుగా జరిగే విపత్తుల్లో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు, మారుమూల ప్రాంతాల్లో కమ్యూనికేషన్ టవర్ గాను, ఇంటర్నెట్ సేవలందించేందుకు ఫ్లోటింగ్ టవర్ గాను ఉపయోగపడుతుందన్నారు. ధర్నాలు, నిరసనలు తెలిపే సమయంలో నిరసనకారులు లేదా పోలీసు సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చేందుకు ఈ డ్రోన్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐలు ఆర్‌విఆర్‌కె చౌదరి, ఎ.వి.లీలారావు, డ్రోన్ పైలట్స్ నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

11మంది తహశీల్దార్లకు బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని 11మంది తహశీల్దార్లకు, 21మంది డిప్యూటీ తహశీల్దార్లకు బదిలీ చేస్తూ కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు గ్రేడ్-1 విఆర్‌ఒలు 39మందికి, గ్రేడ్-2 విఆర్‌ఒలు 50మందికి బదిలీ అయ్యింది.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ వైఎస్ఆర్ కడప జిల్లా క్రీడా పాఠశాలలో ఈ ఏడాది 4వ తరగతి నుంచి 5వ తరగతి అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి జన్మించిన వారు అర్హులైని తెలిపారు. https://apsportsschoo.ap.gov.in లో ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జులై 1 నుంచి 3వరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించు ఎంపిక ప్రక్రియకు ఒరిజినల్‌ధ్రువపత్రాలతో హాజరవ్వాలని కోరారు. వివరాలకు విజయనగరం 9491767327/ 7799620244, పార్వతీపురం 8712622564 ఫోన్ నెంబర్ లను సంప్రదించాలన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలి

స్టాండింగ్ కమిటీ సమావేశంలో వైసిపి ఫ్లోర్ లీడర్ రాజేష్



సమావేశంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్, తదితరులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించకపోతే నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని వైసిపి ఫ్లోర్ లీడర్ రాజేష్ అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కాలువలు ఆక్రమించి, బడ్డీలు పెడుతున్నారని ఆయన తెలిపారు. కోట్లాది రూపాయలు పెట్టి నగర సుందరీకరణ చేస్తే, నేడు ఆ వాతావరణం కనిపించకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారని, అయినా అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని కూడళ్లను సైతం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తంచేశారు. వెంటనే వాటిని తొలగించకపోతే తామే కార్యాలయం వద్ద ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నగర పాలక సంస్థపై జిల్లా కోర్టు, హైకోర్టులో ఎన్ని కేసులు ఉన్నాయో తెలపాలని సభ్యులు కోరారు. నగరంలో మరో 200 మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్‌చేశారు. నగర పాలక సంస్థ భూములను గుర్తించి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. నగరంలో అభివృద్ధి పనులు పూర్తిగా పరిశీలించి సంతృప్తి చెందితే బిల్లులు చెల్లించాలని అధికారులను కమిటీ కోరింది. అనంతరం అజెండాలోని 31 అంశాలకు 30 అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ యోగాంధ్ర ఫ్లెక్సీలలో మేయర్, ఎమ్మెల్యే ఫొటోలు పెట్టకపోవడం ఎంతవరకు సబబని అధికారులను ప్రశ్నించారు. మరోసారి కొనసాగితే ఊరుకునేది లేదని అధికారులను హెచ్చరించారు.

అనంతరం టేబుల్ అజెండాలో మూడు అంశాలను కమిటీ ఆమోదించింది. సమావేశంలో సభ్యులు ఎస్‌వివి రాజేష్, రేగాన రూపవతి, అల్లు చాణక్య, సుంకరి నారాయణరావు, కమిషనర్ నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని కలిసికట్టుగా నిర్మూలిద్దాం

కలెక్టర్ అంబేద్కర్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడం లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన వర్క్ షాప్ లో కలెక్టర్ ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. అంతకు ముందు నగరం లోని అంబేద్కర్ కూడలి నుండి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామం, మండలం, జిల్లా స్థాయి లో ప్రజలకు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కలిగించాలని ఈ సందర్భంగా తెలిపారు. నగర కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ నగరం లో ప్లాస్టిక్ పై యుద్ధాన్ని ప్రకటిస్తున్నామని, దుకాణాలపై దాడులు చేసి ఎక్కడా ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూస్తున్నామని తెలిపారు. నగరంలో 15 వేల వరకు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. జిల్లా అటవీ అధికారి కొండల రావు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన పర్యావరణం దెబ్బ తింటోందని, దీని పరిణామాలు భవిష్యత్తు వారికీ నష్టం కలిగిస్తాయని తెలిపారు. ఒక్క రోజే 4 లక్షల మొక్కల్ని జిల్లాలో నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడానికి కషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ వెంకట రమణ , ప్రొఫెసర్ రామకృష్ణ, పలు పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్టాకును పరిశీలిస్తున్న ఏఓ పూర్ణిమ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో గురువారం ఎఓ ఎం.పూర్ణిమ తనిఖీలు చేపట్టారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎఓ పూర్ణిమ మాట్లాడుతూ విత్తనాలు మొలక శాతం పరిశీలించిన తర్వాత రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మాత్రమే రైతులకు విక్రయించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని షాపుల యజమానులను హెచ్చరించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక గ్రోత్ సెంటర్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఇఇ ఎ.అనంతరావు తెలిపారు. ఎపిఐఐసి ఫీడర్, మల్లమ్మపేట ఫీడర్ల కింద, పక్కనున్న చెట్టు కొమ్మలను తొలగిస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ కాలనీ, ఐటిఐ కాలనీ, రాజుపేట, మల్లమ్మపేట ప్రాంతాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.


గంట్యాడ : కొండతామరపల్లి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్తు అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్తు శాఖాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్మలను తొలగిస్తామని, సాంకేతిక సమస్యలు సరిచేస్తామని చెప్పారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

పథకాల నగదు నేరుగా జమ

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు డిబిటి ద్వారా జమ అవుతుందని, లబ్ధిదారులు ఐపిపిబి ఖాతా తెరవాలని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర అన్నారు. గురువారం పోస్టల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల నగదు ఆటోలో జమకావాలంటే బ్యాంకు ఖాతాకు ఎన్‌పిసిఐ లింక్ తప్పనిసరని, పోస్టాఫీసులో సులభంగా చేసుకోవచ్చని తెలిపారు. అర్హులు దగ్గరలోని పోస్టాఫీసును సంప్రదించాలని కోరారు.

చీపురుపల్లి : సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్‌కు బ్యాంకు ఖాతా, ఎన్‌పిసిఐ అనుసంధానం తప్పనిసరి అని పోస్టల్ చీపురుపల్లి సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.సాయి కిశోర్ తెలిపారు. చీపురుపల్లి పోస్టాఫీస్ పరిధిలో ఉన్న కార్యాలయాల్లో ఈ నెల 14వ తేదీలోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పిసిఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేస్తున్నామని చెప్పారు.



ఎండిఎం కార్మికులతో మాట్లాడుతున్న ఎంఇఒ సాయి చక్రధర్

మరింత రుచిగా మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మరింత రుచిగా వండాలని ఎంఇఒలు విమలమ్మ, బి.సాయిచక్రధర్.. నిర్వాహకులకు సూచించారు. మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గురువారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో జిల్లా సమన్వయకర్త తవుడమ్మ ఆధ్వర్యాన శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ పక్కాగా అమలు చేయాలని సూచించారు.

'నవోదయ'కు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కిల్తంపాలెం జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్ ప్రవేశానికి భవానీనగర్‌లో ఉన్న డాక్టర్ వరలక్ష్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ జానకి దేవి తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో విద్యాలయంలో నిర్వహించిన ఇంటర్ ప్రవేశ పరీక్షకు ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఇల్లా నికిత, మోపాడ తన్మయిశ్రీ, గల్లా వేదా, కల్లా గుణశేఖర్ ఇంటర్‌లో ప్రవేశానికి అర్హత సాధించారు. వీరిని స్కూల్ అధినేత డాక్టర్ వరలక్ష్మి, డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదర్శ పాఠశాలలో ఖాళీ సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సతివాడలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ హెచ్.శైలజ ఒక ప్రకటనలో కోరారు. ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు గతంలో దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులతో పాటు 7, 8, 9వ తరగతులలో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 6, 8, 9, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రస్తుతం సీట్లు ఖాళీ లేవని, ఏడో తరగతిలో ఒక సీటు మాత్రమే ఖాళీ ఉందని తెలిపారు. భవిష్యత్తులో పైన పేర్కొన్న తరగతుల్లో ఏవైనా సీట్లు ఖాళీ అయితే, ఇప్పుడు పెట్టుకొన్న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

భోగాపురం ఇఒగా జయమ్మ

ప్రజాశక్తి-భోగాపురం

ఎట్టకేలకు భోగాపురం మేజర్ పంచాయతీకి ఇఒగా కె.జయమ్మను జిల్లా పంచాయతీ అధికారులు నియమించారు. దాదాపు ఏడాదిపాటు ఇన్‌ఛార్జి పాలనతో గడిచింది. లక్కవరపుకోట జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జయమ్మకు గ్రేడ్ -2 ఉద్యోగోన్నతి లభించింది. దీంతో ఆమెను భోగాపురం మేజర్ పంచాయతీకి ఇఒగా నియమించారు.

మెట్టపల్లిలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని మెట్టపల్లిలో నవ భారత్ ఫౌండేషన్ అధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 35 మందికి శంకర్ ఫౌండేషన్ సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. వీరిలో 10 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శస్త్రచికిత్సలు, పరీక్షలు నిమిత్తం మొత్తం 15 మందిని విశాఖపట్నం తరలించనున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.శ్రీను, మాజీ సర్పంచ్ చందక శ్రీను, ఎంపిటిసి మీసాల ఈశ్వరరావు, టిడిపి నాయకులు మీసాల చిన్నారావు, మానవీయత అధ్యక్షులు గోవిందరాజులు, నవ భారత్ ఫౌండేషన్ అధ్యక్షులు హరి, అంబేద్కర్ గ్రంథాలయం అధ్యక్షుడు బి.కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోగులను తనిఖీ చేస్తున్న వైద్యులు

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ జంక్షన్ నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ పర్యావరణం పట్ల నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. చిన్నతనం నుండే పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ర్యాలీలో అటవీశాఖ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక పూల్ బాగ్ లోని నగరపాలక సంస్థ పార్క్ వద్ద కమిషనర్ నల్లనయ్యఆధ్వర్యాన మొక్కలు నాటారు. స్థానిక కార్పొరేటర్ బందారు ఆనందరావు, నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన డిఇఒ

కస్పా హైస్కూలు ఆవరణలో ఎపి ఎంజిస్, అపాస్ సంయుక్తంగా పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. డిఇఒ యు. మాణిక్యం నాయుడు ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమని, విద్యార్థులు 'హరిత దూతలుగా' మారాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ డిఇఒ కె.వెంకట రమణ, డి సిసిబి కార్యదర్శి సన్యాసి రాజు , జిల్లా సైన్స్ అధికారి రాజేష్, అకడమిక్ కోఆర్డినేటర్ జి .సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో

జెఎన్‌టియులో ప్రిన్సిపల్ , కళాశాల సిబ్బంది మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యం నుంచి రక్షించుకోవాలన్న బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు.

మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ లో..

మహారాజ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఒక చెట్టు -తల్లి పేరుతో 2.0' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ తల్లుల పేరుతో ఒకమొక్కను నాటుతూ భూమాతకు తమ కృతజ్ఞతను తెలియజేశారు. ప్రతి మొక్కను తల్లి పేరు రాసిన ట్యాగ్‌తో గుర్తించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రామయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతం కళాశాల ఆధ్వర్యాన

సీతం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు హాజరయ్యారు.ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, జెఎన్‌టియు నోడల్ ఆఫీసర్ ఎస్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరంలో మొక్కను నాటుతున్న జెడ్‌పిటిసి తవుడు, ఎంపిడిఒ, ఎపిఒ

పుడమి తల్లిని కాపాడాలి

కంటోన్మెంట్ : తమన్నా ఫౌండేషన్, సెట్విజ్ సంయుక్త ఆధ్వర్యంలో అలకానంద కాలనీ, మున్సిపల్ పార్క్‌లో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా నాలుగెస్సల పాల్గొన్నారు. పుడమి తల్లిని కాపాడవలసిన బాధ్యత అందరిదీ అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ అధ్యక్షులు బొడ్డేపల్లి రామకృష్ణారావు, వాకర్స్ క్లబ్ సభ్యులు క్రోతు సత్యం, హెల్ప్ హ్యాండ్ ఫ్రెండ్స్ గ్రూపు సభ్యులు గులిపల్లి నరసింగరావు, విస్సకోట రమేష్, మజ్జి అప్పారావు, హరికృష్ణ, ఉపాధ్యాయులు , స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



విజయనగరంలో మొక్కకు నీరు పోస్తున్న కమిషనర్ పి.నల్లనయ్య

బొబ్బిలి : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. పట్టణంలో పార్కు గట్టుపై గురువారం గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యాన ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించాలంటే మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, కమిషనర్ రామలక్ష్మి, కౌన్సిలర్లు, గ్రీన్ బెల్ట్ అధ్యక్షులు ఎవిఎ రమణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షులు జెసి రాజు, క్లబ్ అధ్యక్షులు సింగ్రెడ్డి శ్రీనివాసన్, కార్యదర్శి ఎలెక్ట్ శివకాంత్.. స్థానిక కోర్టులో ఆవరణ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణి రావుకు మొక్కలను అందజేశారు. కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు మొక్కలు నాటారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

బాడంగి : బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తహశీల్దార్ సుధాకర్, ఎంపిడిఒ శంబంగి రామకృష్ణ, ఎపిఒ సాయిరాం, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, సర్పంచ్ కె.రమేష్ మొక్కలు నాటారు.

నెల్లిమర్ల : నగర పంచాయతీ కార్యాలయ సమీపంలో ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే లోకం మాధవి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారుసరోజిని, కమిషనర్ ఎ.తారకనాథ్, తహశీల్దార్ పి.సుదర్శనరావు, ఎస్ఐ బి.గణేష్, జనసేన నాయకులు చనమల్ల వెంకటరమణ, రవ్వా నాని, తదితరులు పాల్గొన్నారు. మిమ్స్‌లో ఎంబిబిఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు.

గజపతినగరంరూరల్ : గజపతినగరం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తవుడు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.కళ్యాణి, ఎపిఒ కృష్ణవేణి పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ ఎస్‌డబ్ల్యుపిసి వద్ద ఎంపిపి సూర్యనారాయణ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఎపిఒ ఆదిలక్ష్మి, ఎఒ యశ్వంత్ కుమార్, ఎపిఒ సూర్యనారాయణ, ఎంపిటిసి గంగతల్లి, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో మొక్కను నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

చీపురుపల్లి : స్థానిక రైతు సేవా కేంద్రంలో తహశీల్దార్ ఎన్.రాజారావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో టిడిపి రౌతు కామనాయుడు, వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వన సంరక్షణ -మన సంరక్షణ

వన సంరక్షణ చేస్తే మనల్ని మనం సంరక్షించుకున్నట్లేనని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, సాంస్కృతిక విభాగం కన్వీనర్ గంద్రేటి శ్రీను (డప్పు శ్రీను), నగర అధ్యక్షుడు పి.షణ్ముఖరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంకాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం మాధవి మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యాన పెదకండేపల్లి రహదారిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు పంపిణీ చేసి, నాటారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సోమేశ్వరరావు, ఎంపిడిఒ సతీష్ మొక్కలను నాటారు. శృంగవరపుకోట ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో మొక్కలను నాటారు.

మెరకముడిదాం : వనం-మనం కార్యక్రమంలో బోడెందొరవలస- చెల్లాపురం మార్గంలో డిపిఒ టి.వెంకటేశ్వర్లు మొక్కలు నాటారు. అనంతరం గర్భాంలోని ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.భాస్కరరావు, తహశీల్దార్ రఫీజాన్, జెఇ నరేంద్ర, గర్భాం ఇఒ విశ్వనాథం, సర్పంచ్ గాబ్రియేల్, ఉపసర్పంచ్ తాడ్డి సత్యం నాయుడు, టిడిపి నాయకులు తాడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

తెర్లాం : తెర్లాంలో వ్యవసాయ శాఖ జెడి వి.టి.రామారావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.ఉమాలక్ష్మి, ఎఎంసి చైర్మన్ ఎన్.వెంకట్ నాయుడు, ఎంపిడిఒ రాంబాబు, ఎపిఒ సుశీల, తదితరులు పాల్గొన్నారు.



తెర్లాంలో మొక్కను నాటుతున్న జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు

రోడ్డు వెడల్పునకు హోటల్ సిబ్బంది యత్నం

అడ్డుకున్న దిబ్బలపాలెం రైతులు

ప్రజాశక్తి- భోగాపురం

రైతుల తమ జిరాయితీ భూముల్లో వేసుకున్న రోడ్డును వెడల్పు చేసేందుకు హోటళ్ల నిర్వాహకులు ప్రయత్నించగా రైతులు గురువారం అడ్డుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని తహశీల్దార్ ఎం.సురేష్ దృష్టికి తీసుకువెళ్లారు. కంచేరు రెవెన్యూ పరిధి, విశాఖ జిల్లా అన్నవరం రెవిన్యూ పరిధిలో ఒబెరాయ్, మైఫేర్ సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయించడంతో హోటల్స్ నిర్మిస్తున్నాయి. ఈ హోటళ్లకు వెళ్లాలంటే దిబ్బలపాలెం సమీపంలో రైతులు తమ జిరాయితీ భూముల్లో వేసుకున్న రోడ్డులో నుంచి వెళ్లాలి. అయితే ఈ సంస్థలు ఎవరి అనుమతులూ తీసుకోకుండా లారీలతో రాళ్లు తెచ్చి రోడ్డుపై పోగులు వేస్తుండడంతో రైతులు వెంటనే అడ్డుకున్నారు. తమ భూముల నుంచి రోడ్డు వేసేందుకు అనుమతులు ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు ఇచ్చారని హోటల్ సిబ్బంది చెప్పడంతో వెంటనే స్థానిక రెవిన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. తహశీల్దార్ సురేష్, ఆర్ ఐ ఇమ్రాన్, విఆర్ఒ నాయుడు, దిబ్బలపాలెం వెళ్లి హోటల్ సిబ్బందితో మాట్లాడి రైతుల అనుమతులు లేకుండా



హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ఎలా రోడ్డు వేస్తారంటూ ప్రశ్నించారు. మళ్లీ ఇలాంటి తప్పిదాలు చేయరాదని వారిని గట్టిగా హెచ్చరించారు.

ప్రజలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

ఎన్నికల హామీలను అమలు చేయకుండా టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య విమర్శించారు. గురువారం గజపతినగరంలోని వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. ఈరోజు, రేపు, ఎల్లుండి.. అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి ప్రజలను మోసగిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి గతేడాది సొమ్మును ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. సమావేశంలో జెడ్‌పిటిసి గార తవుడు, త్రినాథరావు, వెంకట్రావు, సురేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతులు సులభం

ప్రజాశక్తి-బొబ్బిలి

మధ్యవర్తిత్వం లేకుండా భవన నిర్మాణ అనుమతులు సులభంగా పొందవచ్చని టౌన్ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.నాయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్మన్ శరత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కౌన్సిల్ హాల్లో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో సులభంగా అనుమతులు పొందవచ్చునని చెప్పారు. భవన నిర్మాణ అనుమతులకు మధ్యవర్తులను సంప్రదించకుండా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని ఆర్‌టిఒ కార్యాలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా మరో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొండకరకాం గ్రామానికి చెందిన కోరాడ ప్రమోద్‌కుమార్, కిలారి చిన్నారావు, గాదిపల్లి సునీల్ కలిసి రెండు మోటారు బైకులపై విజయనగరంలో బైక్ మెకానిక్ దగ్గరకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురూ కలిసి బైక్‌పై కొండకరకాం వెళ్తుండగా ఆర్‌టిఒ కార్యాలయం సమీపంలో పక్కనున్న హోటల్ వైపు నుంచి బొలెరో వాహనం వచ్చి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చిన్నారావు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సిఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం జరజాపుపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ గణేష్ కథనం ప్రకారం.. మొయిద నారాయణ పట్నానికి చెందిన పతివాడ నారాయణరావు (35) భవననిర్మాణ కార్మికుడు. గురువారం జరజాపుపేటలో సీలింగ్ పనులు చేస్తున్నాడు. ఇంతలో రాడ్ ప్రమాద వశాత్తూ అటువైపుగా వెళ్తున్న కరెంటు లైన్‌ను తాకడం వల్ల షాక్‌కు గురై అక్కడకక్కడే కింద పడిపోయాడు. అక్కడే పనిచేస్తున్న కూలీలు వెంటనే గాయపడిన ఆయన్ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నారాయణ రావు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నారాయణరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే వ్యక్తి అకాలమృతితో కుటుంబ సభ్యులు తమకెవరు దిక్కని విలపిస్తున్నారు. ఎస్ఐ గణేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



మృతి చెందిన నారాయణరావు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-రామభద్రపురం

మరో 5 నిమిషాల్లో ఇంటికి చేరుకునే తరుణంలో యువకుడిని మృత్యువు కబలించింది.ఆరికతోట జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దత్తిరాజేరు మండలం స్టేషన్ బూర్జవలసకు చెందిన కస్తూరి సాయికుమార్ (21) పనిమీద ఆరికతోట వచ్చి స్వగ్రామం స్టేషన్ బూర్జవలసకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా విజయనగరం నుంచి రామభద్రపురం వస్తున్న లారీ ఎదురుగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. మృతునికి తండ్రి ప్రభాకరరావు, తల్లి లక్ష్మీతోపాటు ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. ట్రాక్టర్ నడుపుతూ వ్యవసాయం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. ఇలాంటి సమయంలో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది. మృతుని బంధువుల రోదనలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.



సాయికుమార్ (ఫైల్)

4వ రోజూ కొనసాగిన యోగాంధ్ర పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రవ 2025 అర్బన్ స్థాయి 4వ రోజు పోటీలను నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు గురువారం ప్రారంభించారు. స్థానిక రాజీవ్ స్టేడియం లో పాటల పోటీలు,యోగా చిత్రలేఖనం, సంబంధించి సచివాలయాల పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపిక చేసిన వారితో పోటీలు నిర్వహించి, వారి నుంచి అర్బన్ స్థాయిలో 1,2,3 కేటగిరీలో ఎంపిక చేసినట్లు తెలిపారు. నగరపాలక సంస్థ సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, పీడీలు, పిఇటిలు, యోగా శిక్షకులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని జైభీం భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రామ తీర్థం జంక్షన్‌లో జైభీం భారత్ పార్టీ ఆధ్వర్యంలో హామీలు అమలు చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చిన్నం అరుణ్ కుమార్, మరడాన వెంకట నాయుడు, పైల జ్యోతి, పొడుగు రామకృష్ణ పాల్గొన్నారు.



రోడ్డుపై కూలిపోయిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు

గాలీవాన బీభత్సం

కూలిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో గురువారం మధ్యాహ్నం గాలి వాన బీభత్సం సృష్టించింది. దీంతో దబ్బిరాజుపేట, చామలాపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎన్నడూ లేని విధంగా వర్షం వచ్చే ముందు భయంకరమైన ఉరుములు, మెరుపులతో పాటు గాలులు వీయడంతో ప్రజలు భయాందోళన చెందారు.

ఎస్‌జిటిలకు హెచ్‌ఎం పోస్టులు కేటాయించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌జిటిలకు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం ఉద్యోగోన్నతులు కల్పించాలని ఎపిటిఎఫ్ 1938 జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఈమేరకు డిఇఒ యు.మాణిక్యంనాయుడుకు వినతి అందజేశారు. ఎస్‌జిటిలు 30,35 సంవత్సరాలు సర్వీస్ చేసి ఎటువంటి పదోన్నతి లేకుండా ఉద్యోగ విరమణ చేస్తున్నారని తెలిపారపు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1400 పిఎస్ హెచ్ ఎం పోస్టులు కేటాయించారని, విజయనగరం జిల్లాకు ఒక పోస్ట్ కూడా కేటాయించకపోవడం ఎస్జీటీలకు అన్యాయం చేయడమేనని అన్నారు. జిల్లాకు పిఎస్ హెచ్‌ఎం పోస్టులు కేటాయించి ఎస్‌జిటి నుంచి ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి కలిశెట్టి భరద్వాజ్‌కు ఎమ్మెల్యే బేబినాయన ఆర్థిక సహాయం చేశారు. రామభద్రపురం మండలం మిర్తివలసకు చెందిన కలిశెట్టి భరద్వాజ్ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించడంతో ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో టిడిపి రామభద్రపురం మండల నాయకులు అందజేశారు.